క్లుప్తంగా

ఇన్‌చార్జి ఈవోఆర్డీగా మోహన్

పెద్దతిప్పసముద్రం: మండల ఇన్‌చార్జి ఈవోఆర్డీగా మోహన్ ప్రతాప్ నియమితులైనట్లు ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. ఇక్కడ రెగ్యులర్ ఈవోఆర్డీగా పని చేస్తున్న యోగానంద్ అనంతపురం జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో ములకలచెరువు మండలంలో పనిచేస్తున్న ప్రతాప్‌ను ఇక్కడ ఇన్‌చార్జి అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు.

తల్లికి వందనం ఇవ్వాలి

మదనపల్లె సిటీ: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా తల్లికి వందనం ప్రతి విద్యార్థికి అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభల కరపత్రాలను మదనపల్లెలో ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 28, 29వ తేదీల్లో మదనపల్లెలో సభలు జరుగుతాయన్నారు. విద్యార్థులు, పలువురు అధ్యాపకులు తమ వంతు విరాళాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రమణ, కార్తీక్, జయబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపై దాడి తగదు

గుర్రంకొండ: ఒడిషాకు చెందిన బీజేపీ ఎంపీ సారంగిపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ దాడి చేయడం దారుణమని మండల బీజేపీ అధ్యక్షుడు రామాంజులు అన్నారు. గుర్రంకొండలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నియంతృత్వ పోకడలకు ఇదో ఉదాహరణ అన్నారు. భరత్ చౌదరి పాల్గొన్నారు.

బీరువాల వితరణ



బీరువాలు అందజేస్తున్న బీఈడీ విద్యార్థులు

మదనపల్లె సిటీ: స్థానిక మాయాబజార్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలకు క్రిస్టియన్ బీఈడీ కళాశాల విద్యార్థులు రెండు బీరువాలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురం వెంకటరమణను గురువారం కలిసి వాటిని అందించారు. ఉపాధ్యాయురాలు మధువాణి స్టీల్ గ్లాసులు, సుధీర్ పెద్ద టీ ప్లాస్కు అందించారు. పర్యావరణ హితం కోసం ప్లాస్టిక్ గ్లాసులు వాడకూడదని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉదయ్‌కుమార్, అంజప్ప, జ్యోతి, శోభారాణి, మధువాణి, హసీనా, వెంకట్, నారాయణరెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పరిశీలన

మదనపల్లె: మండలంలో జరుగుతున్న సిమెంట్ రోడ్ల పనులను ఎంపీడీవో తాజ్ మాస్రూర్ గురువారం పరిశీలించారు. పొన్నేటి పాలెం పంచాయితీ పనసమాకులపల్లెలో జరుగుతున్న రోడ్డు పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులు నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. అనంతరం పొన్నేటిపాలెం సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

ఉప్మా సరిగా లేదని ఆందోళన

మదనపల్లె సిటీ: ఉప్మా సరిగా చేయలేదని విద్యార్థులు ఆరోపించారు. స్థానిక ఎంఎల్ఎల్ ఆస్పత్రి వద్దనున్న గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయం బయట ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ ఇటీవల ఉదయం టిఫన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు సరిగా వండడంలేదని విద్యార్థులు ఆరోపించారు. తాగేందుకు ఆర్‌ఓ వాటర్ కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన విద్యార్థులు ఆయన లేకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. ఈ విషయంపై ప్రిన్సిపల్ రంగనాయకులు వివరణ కోరగా కుక్ రమణను మందలించినట్లు తెలిపారు.

షెడ్ల నిర్మాణం పూర్తి చేద్దాం

తంబళ్లపల్లె: ప్రభుత్వం మంజూరు చేసిన గోకులం గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు పశు వైద్య సిబ్బంది కృషి చేయాలని మదనపల్లె పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ సూచించారు. మండలంలో గురువారం ఆయన పర్యటించి షెడ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. పశు వైద్య సిబ్బంది చేపట్టిన పశుగణన సర్వే పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఏడీ సుమిత్ర, సుజనశ్రీ పాల్గొన్నారు.

పాస్టర్లకు కానుకల పంపిణీ

మదనపల్లె: క్రైస్తవ పాస్టర్లకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా గురువారం కానుకలు పంపిణీ చేశారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న రాయల్ అరేబియా ఫంక్షన్ హాల్ లో గ్లోరీ పాస్టర్స్ అసోసియేషన్, పీటర్ రాక్ చర్చ్ ఎస్బీఐ కాలనీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పాస్టర్ జాన్ బాబు ఆధ్వర్యంలో ముందుగా పాస్టర్లకు దుస్తులు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. క్రిస్మస్ పర్వదినాన్ని సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రైస్తవ పాస్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

కురబలకోట: మండలంలోని అంగళ్లు జడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని వెన్నెల అదృశ్యమైనట్లు కుటుంబీకులు గరువారం ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ వినాయక చేనేత నగర్‌కు చెందిన ఈమె ఉదయం ఆటోలో హైస్కూల్‌కు బయలుదేరింది. తిరిగి ఇంటికి చేరలేదు. చుట్టుపక్కల ప్రాంతాలో తెలిసిన వారి వద్ద విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు

మండల కార్యాలయంలో హైడ్రామా

- ముందస్తుగా పోలీసులతో బందోబస్తు
- అడ్డుకునేందుకు సిద్ధమైన కూటమి శ్రేణులు
- మండల్ మీట్‌కు హాజరు కాని సభ్యులు
- సర్క్యులర్ అందలేదని అసహనం



బి.కొత్తకోట ఎంపీడీఓ కార్యాలయం గేటు వద్ద పోలీసుల బందోబస్తు

బి.కొత్తకోట: మండల సర్వసభ్య సమావేశాల నిర్వహణ తీరే మారిపోతోంది. ఒక్కో మండలంలో ఒక్కో తరహా పరిస్థితులు నెలకొంటుంటే. బి.కొత్తకోట మండల మీట్ నిర్వహణ మరోలా ఉంది. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ హైడ్రామాకు తెరలేచింది. ముందస్తుగా అధికారులు సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయగా ఎంపీటీసీ సభ్యులు ఎవరూ హాజరుకాలేదు. కొద్దిసేపటికే మండల మీట్ వాయిదా వేస్తున్నట్టు ఎంపీడీఓ శంకరయ్య ప్రకటించారు. అయితే ఇక్కడే అసలు ట్విస్ట్ వెలుగు చూసింది. ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వకపోవడంతో రాలేదనే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

సర్క్యులర్లు ఇవ్వలేదనే...

సాధారణంగా మండల మీట్ నిర్వహణపై సభ్యులకు సర్కులర్ ద్వారా సమాచారం ఇచ్చి సంతకాలు తీసుకుంటారు. ఈ సమావేశానికి మెజార్టీ ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వలేదని తెలిసింది. మొత్తం ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీ తరఫున ఎన్నికైనవాళ్లే కావడంతో గత సమావేశాన్ని టీడీపీ కూటమి శ్రేణులు అడ్డుకున్నారు. నిబంధనల ప్రకారం ముందుగా ఎంపీపీతో చర్చించాక తేదీ నిర్ణయం తీసుకోవాలి. మండలంలోని 11 ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే ఎంపీపీ లక్ష్మీనరసమ్మకు కూడా స్వయంగా సర్క్యులర్ అందివ్వకుండా, ఆమె కుటుంబీకులకు అందించారని, మరో ఎంపీటీసీ సభ్యుడి ఇంటికి వెళ్లిన సిబ్బంది ఆయన కుటుంబీకులకు అందించి వచ్చారని తెలిసింది. మిగిలిన సభ్యులకు సర్క్యులర్ అందలేదని చెబుతుండగా మండలమీట్ ఉందని వాట్సాప్ ద్వారా సమాచారం ఎంపారని పలువురు ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సమాచారం లేక మండల మీట్‌కు హాజరుకాలేకపోయామని ఎంపీటీసీలు పేర్కొన్నారు.

వచ్చినా వెనక్కు

మండల మీట్ నిర్వహణ సజావుగా సాగాలని సీఐ జీవన్ గంగనాథ్‌బాబు పోలీసులతో గట్టి భద్రత ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరయ్యేలా చలిమామిడి రోడ్డు వద్దనే బ్యారికేడ్లు పెట్టి పోలీసులను ఏర్పాటు చేశారు. కార్యాలయం గేటు వద్ద భద్రత పెట్టి సభ్యులు మినహా, ఇతరులను లోపలికి రానివ్వకుండా చర్యలు తీసుకున్నారు. మండల మీట్‌ను అడ్డుకునేందుకు వచ్చిన కూటమి శ్రేణులను చలిమామిడి రోడ్డు వద్దనే పోలీసులు ఆపేశారు. ఈ సమావేశం కోసం ఎంపీపీ లక్ష్మీ నరసమ్మ, ఒకరిద్దరు ఎంపీటీసీలు హాజరయ్యేందుకు వచ్చినా కార్యాలయంలోకి రాకుండానే వారు కూడా తిరిగి వెళ్లిపోయారు. కాగా నిర్ణీత సమావేశానికి ఎంపీటీసీలు హాజరుకాకపోవడంతో మండలమీట్ వాయిదా వేస్తున్నట్టు ఎంపీడీఓ శంకరయ్య ప్రకటించారు. సభ్యులకు సమాచారం ఇవ్వలేదన్న విషయమై ఆయన వివరణ ఇస్తూ సమాచారం ఇచ్చామని చెప్పారు.

ఇసుక తరలించకుండా గోతుల తవ్వకం



జేసీబీలతో ట్రెంచ్ తీయిస్తున్న పోలీసులు

గుర్రంకొండ: ఇసుక అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చెరువుకు వెళ్లే అక్రమదారులకు అడ్డంగా గోతులు(ట్రెంచ్‌లు) తవ్వించారు. మండలంలోని రామానాయిని చెరువులో గత నాలుగు నెలలుగా అక్రమార్కులు జేసీబీతో రాత్రింబవళ్లు ఇసుక తవ్వేసి టిప్పర్లు, ట్రాక్టర్లతో బయట మండలాలకు తరలించారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో తహసీల్దారు శ్రీనివాసులు, ఎస్‌ఐ మధురామచంద్రుడు గురువారం చెరువును పరిశీలించారు. చెరువు చుట్టూ వాహనాలు వెళ్లే మార్గాలను ముందుగా గుర్తించారు. అనంతరం జేసీబీతో ఆ మార్గాల్లో పెద్ద ఎత్తున కందకాలు తవ్వించేశారు. మనుషులు, పాడి ఆవులు చెరువులోకి వెళ్లే విధంగా దారి ఉంచి ట్రెంచ్‌లు ఏర్పాటు చేయించారు. వారు మాట్లాడుతూ అనుమతి లేకుండా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ మోసెస్, సిబ్బంది నాగరాజు, చంద్రశేఖర్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్యం



సభలో పాల్గొన్న ప్రతినిధులు

బి.కొత్తకోట: అమర వీరుల త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. దేశం కోసం అమరులైన అష్ఫాఖుల్లాఖాన్, రాజేంద్రనాథ్‌లహరి, రాంప్రసాద్ బిస్మిల్, రోషన్‌సింగ్‌లను స్మరించుకొంటూ బి.కొత్తకోటలో గురువారం అమరుల వర్ధంతి సభ గురువారం నిర్వహించారు. అమరుల చిత్రపటాలకు నివాళి అర్పించారు. వక్తలు మాట్లాడుతూ జమీందారీ కుటుంబంలో జన్మించిన అష్ఫాఖుల్లా ఖాన్ స్వాతంత్ర్యం కోసం పోరాడారని, భగత్‌సింగ్ ఉరి తీతకు నాలుగేళ్ల ముందే 1927 డిసెంబర్, 19న బ్రిటీషర్ల చేతిలో ఉరితీయబడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు హుస్సేన్‌ఖాన్, నాసీర్, కాలేషా, బాబూఖాన్, తాజ్ బాషా, నారాయణస్వామిరెడ్డి, మనోహర్‌రెడ్డి, బషీర్‌ఖాన్, నక్కా మహేష్, మాజీ ఎంపీటీసీ ఎండీ.మస్తాన్, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా చిత్రపటం దహనం



అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

మదనపల్లె: అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మదనపల్లెలో మాలమహానాడు, వీసీకె పార్టీలు వేర్వేరుగా గురువారం నిరసన తెలిపారు. వీసీకె పార్టీ ఆధ్వర్యంలో స్థానిక బెంగుళూరురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా చిత్రపటాలను మంటల్లో వేసి దహనం చేశారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీసీకె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగం మీద గౌరవం లేని అమిత్‌షాకు రాజ్యాంగబద్ధమైన పదవుల్లో కొనసాగే అర్హత లేదన్నారు. అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించి ఆయనచే క్షమాపణ చెప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల మోహన్, నీరుగట్టి రమణ, రవి శంకర్, రెడ్డప్ప, రెడ్డిప్రసాద్, కృష్ణ పాల్గొన్నారు.

- స్థానిక ఆర్టీసీ బస్టాండు సర్కిల్ వద్దనున్న అంబేడ్కర్ సర్కిల్ వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అంబేడ్కర్ చరిత్రను కనుమరుగు చేసే విధంగా బీజేపీ కుట్ర చేస్తోందని మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ యమలా సుదర్శనం అన్నారు. అంబేడ్కర్‌ను అవమానించే విధంగా రాజ్యసభలో మాట్లాడిన అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పి మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు చంద్రయ్య, మనోహర్, మోహన్, లక్ష్మీపతి, అప్పయ్య, రమణ, నారాయణ, రమేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి



ర్యాలీ చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

మదనపల్లె సిటీ: విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలని విద్యుత్తు శాఖ ఈఈ గంగాధరం అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈఈ మాట్లాడుతూ విద్యుత్ పొదుపు కోసం ఎల్‌ఈడీ బల్బులు వాడాలన్నారు. వినియోగదారులంతా స్టార్ రేటెడ్ విద్యుత్ ఉపకరణాలు వాడాలన్నారు. డీఈఈలు హరికుమార్, సురేంద్రనాయక్, ఏఏఓ కిరణ్‌కుమార్, ఏఈలు కుమార్‌బాబు, అజయ్, రమేష్, రామమూర్తి, ఉత్తన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో పంచాయతీ అభివృద్ధి

పీలేరు: పీలేరు పంచాయతీని అభివృద్ధి చేయడానికి సమష్టి కృషి అవసరమని సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పక్షపాత ధోరణి వీడి పంచాయతీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. పంచాయతీ తీర్మానం లేకుండా ఇష్టానుసారం కార్మికులను తొలగించడం, జీతాలు సక్రమంగా ఇవ్వకుండా వేధించడం సమంజసం కాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు పెండింగ్ బిల్లులు ఇవ్వ కుండా కాంట్రాక్టర్లను వేధించడం సరి కాదన్నారు. సర్పంచ్, వార్డు సభ్యులకు తగిన గుర్తింపు ఇవ్వలేదని ఈవోను ప్రశ్నించడంతో కొంత వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో సీఐ యుగంధర్, ఎస్‌ఐ బాలకృష్ణ అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు సర్ది చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, వార్డుమెంబర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయండి

– చింతలతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



మాజీ సీఎం జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డి

కలికిరి: పీలేరు నియోజకవర్గంలో క్షేత్ర స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి సూచించారు. విజయవాడ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డిని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టానికి చేపట్టాల్సిన కార్యకరణ, పార్టీ కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొనాలని ఆదేశించిట్లు చింతల తెలిపారు.

కలికిరి: జననేత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శనివారం నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోరారు. పండగ వాతావరణంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జన్మదినం నిర్వహించాలని, ఈ సందర్భంగా మండల, గ్రామ స్థాయిలో అన్నదానం, ఇతర సేవా కార్యక్రమాలు, కేక్ కటింగ్ నిర్వహించాలని కోరారు.

సేవలు వినియోగించుకోవాలి

మదనపల్లె: జెండర్ రిసోర్స్ సెంటర్(జీఆర్‌సి) సేవలు మహిళలంతా ఉపయోగించుకోవాలని ఎంపీడీవో తాజ్‌మస్రూర్ పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం జీఆర్సీ సమీక్ష సమావేశం జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ మదనపల్లెకి జీఆర్సీ సెంటర్ మంజూరు చేయడం జరిగిందన్నారు. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి భూమిని ఇప్పించండి



సమస్య విన్నవిస్తున్న బాధితులు

మదనపల్లె: పదేళ్లపాటు కబ్జాకు గురైన తమ భూమిని అప్పగించి ఆదుకోవాలని కోరుతూ బాధితులు అధికారులను కోరారు. మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో బాధితులు శ్రీనివాసులు, రాజేశ్వరి, పార్వతమ్మ, ఆయేషా మాట్లాడుతూ బసినికొండ గ్రామం వెంకప్పకోట సర్వే నెంబర్ 1072–1లో మూడు ఎకరాల భూమిని తమ తండ్రి పరదాని చిన్నస్వామి పేరిట ప్రభుత్వం పాసుబుక్ ఇచ్చిందన్నారు. అప్పటి నుంచి చిన్నస్వామి, వెంకటలక్ష్మమ్మ దంపతులు ఆ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో మదనపల్లెకు చెందిన ఓ గ్రానైట్ వ్యాపారి తమ భూమిని యథేచ్ఛగా కబ్జా చేశారన్నారు. ఇపుడు భూమిలోకి తమను రానివ్వకుండా దౌర్జన్యం చేస్తున్నాడని ఆరోపించారు. కలెక్టర్, ఎస్పీకి అర్జీలు ఇచ్చినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదన్నారు. రాజకీయ నాయకుల అండతో అధికారులను ప్రలోభాలకు గురిచేస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. భూమిని పరిశీలించేందుకు వచ్చిన ప్రస్తుత తహసీల్దారు ఖాజాబీ సైతం తమ సమస్య పరిష్కరించలేదన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చొరవ తీసుకుని తమ భూమిని తమకు ఇప్పించి ఆదుకోవాలని వారు కోరారు.

వాగు ఆక్రమించారని అధికారులకు ఫిర్యాదు



వాగు భూములు కబ్జాకు గురయ్యాయంటూ ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

గుర్రంకొండ: వాగు పోరంబోకు భూములు కొంత మంది కబ్జా చేశారంటూ గ్రామస్థులు తహసీల్దారు శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. మండలంలోని తరిగొండలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అధికారులు వినతులు స్వీకరించారు. తరిగొండ పంచాయతీ ఇరగన్నగారిపల్లె గ్రామస్థులు పెద్ద ఎత్తున అక్కడి చేరుకొని సమస్యపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 36 ఎకరాల వాగు పోరంబోకు భూములను కొందరు కబ్జా చేశారని పేర్కొన్నారు. సదరు భూముల్లో బోర్లు వేసి కంచె ఏర్పాటు చేశారన్నారు. అటువైపు పొలాలకు వెళ్లే దారిలేక రైతులు ఇబ్బంది పడుతున్నామని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై విచారణ జరిపి సమస్య పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాయచోటి డీఎల్‌డీవో లక్ష్మీపతి, తహసీల్దారు శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

కొత్త టెక్నాలజీని ఉపయోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

మదనపల్లె సిటీ: ఇంజినీరింగ్ విద్యార్థులు కొత్త టెక్నాలజీ ఉపయోగించుకొని కంపెనీలో ఉద్యోగాలు పొందాలని ఏఎస్‌కె ఆటోమోటివ్స్ అడిషనల్ జనరల్ మేనేజర్ గోవిందరావు అన్నారు. స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్‌లో డిజైనింగ్ థింకింగ్, క్రిటికల్ థింకింగ్, ఇన్నోవేషన్ డిజైన్ అంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థులు ఈ సెమినార్‌లలో పాల్గొని తమ సృజనాత్మకత పెంపొందించుకోవాలన్నారు. క్రమశిక్షణతో తమ ఆలోచనా నైపుణ్యం పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామలింగారెడ్డి, హెచ్‌ఓడీ లక్ష్మయ్య, కో ఆర్డినేటర్ శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గుర్రంకొండ: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ పథకం ఉద్దేశ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో వెంకటేశులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ పథకంపై గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో ప్రజారోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఇళ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోకపోతే , రోగాలు ప్రబలే అవకాశముందన్నారు. జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వాస్పత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకొనేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని, బాల్యవివాహాలు, వాటి అనర్థాలు, సమాజంలో పిల్లల పెంపకంపైనా వారికి వివరించాలని ఆయన సూచించారు.

తంబళ్లపల్లె: గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీఓ ఉపేందర్ రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. ఎంపీడీఓ మాట్లాడుతూ శిక్షణ పొందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ ఉద్యోగులు అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి పంచాయతీకి మంచి ర్యాంకు వచ్చేలా చూడాలన్నారు.

పీలేరు: గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంపీడీవో శివశంకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై గురువారం రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు.

దేవదాయ శాఖ నుంచి తొలగించండి



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

మదనపల్లె: మా ఇంటి స్థలాలను దేవాదాయ శాఖ భూముల నుంచి తొలగించి న్యాయం చేయాలని బాధితులు అధికారులను వేడుకున్నారు. మండలం లోని కొత్తపల్లె పరిధిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. ఎస్‌వీఆర్ ఎక్స్‌టెన్షన్, బుగ్గ కాలువ ప్రాంతాలకు చెందిన బాధితులు మాట్లాడుతూ 50 కుటుంబాల వాసులు ఇల్లు నిర్మించుకున్నామని, ప్రస్తుతం ఆ ఇంటి స్థలాలపై తాము హక్కు కోల్పోయామన్నారు. రెవెన్యూ అధికారుల తప్పిదం కారణంగా సుమారు ఐదు ఎకరాలు, బుగ్గ కాలువ ప్రాంతంలో సుమారు నాలుగు ఎకరాలు, దేవాదాయ శాఖ భూములలో కలిసిపోయాయన్నారు. దీంతో తమ స్థలాలపై హక్కులు లేక, ఆపద సమయంలో క్రయవిక్రయాలు చేసుకోలేక, అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి, తమ నివాస స్థలాలను దేవాదాయ శాఖ భూముల నుంచి తొలగించాలని కోరుతూ ఫిర్యాదులు అందించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఓ అమర్‌నాథ్‌రెడ్డి, తహసీల్దారు ఖాజాబీ పాల్గొన్నారు.

నిమ్మనపల్లె: రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ధనుంజయులు పేర్కొన్నారు. మండలంలోని రెడ్డివారిపల్లె సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమించినా, కబ్జా చేసినా ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

పెద్దమండ్యం: రెవెన్యూ సదస్సుల్లో రైతులు తమ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దారు సయ్యద్‌అహ్మద్ పేర్కొన్నారు. పెద్దమండ్యం సచివాలయం వద్ద గురువారం గ్రామ సర్పంచ్ ఎస్.బాషా అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు స్వీకరించారు.

పీలేరురూరల్: గ్రామ రెవెన్యూ సదస్సులో సమర్పించిన ప్రతి అర్జీని పరిశీలిస్తామని ప్రత్యేకాధికారి ఎస్.రమా అన్నారు. మండలంలోని రేగళ్లు సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మొత్తం 82 అర్జీలు వచ్చాయని, ప్రతి అర్జీ పరిష్కరిస్తామన్నారు. నోడల్ ఆఫీసర్ భరత్‌కుమార్‌రెడ్డి, తహసీల్దారు భీమేశ్వరరావు పాల్గొన్నారు.